

కర్నూలు హైకోర్టు బెంచ్

• రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు సిఎం కార్యాలయం నుంచి న్యాయశాఖకు వచ్చిన లేఖతో ప్రక్రియను న్యాయశాఖ మొదలుపెట్టింది. బెంచ్ ఏర్పాటుకు సంబంధించి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు న్యాయశాఖ కార్యదర్శి సునీత లేఖ రాశారు. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన మంత్రి మండలి సమావేశం కూడా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసింది. అమరావతిలో హైకోర్టు కొనసాగుతూనే హైకోర్టు బెంచ్ కర్నూలులో అందుబాటులోకి రానుంది. గతంలో అధికారంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని, హైకోర్టును కర్నూలుకు తరలిస్తామని పలు సార్లు ప్రకటనలు చేశారు. కర్నూలు హైకోర్టు ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు. కర్నూలు నగర శివార్లలోని జగన్నాథగట్టు సమీపంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు. అది కూడా శంకుస్థాపనకే పరిమితమైంది. తరువాత ఎలాంటి పనులూ చేపట్టలేదు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేశారు. ఆ నేపథ్యంలో కర్నూలుకు వచ్చిన చంద్రబాబు నాయుడును వైసిపి నాయకులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో యువగళం పాదయాత్ర చేపట్టిన సందర్భంగా టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీల మేరకు టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రకటన చేశారు. దీనిని కర్నూలు న్యాయవాదులు స్వాగతిస్తున్నారు. వీలైనంత త్వరగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



'స్మార్ట్' షాక్...!

ఇకపై స్మార్ట్ దోపిడి మొదలు కానుంది. సెల్‌ఫోన్ మాదిరి రీఛార్జ్ చేయకుంటే ఇంటికి విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటికే ఈ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటు చేయగా వాణిజ్య, గృహ సర్వీసులకూ ఏర్పాటు చేసేలా కసరత్తు సాగుతోంది. ఒక్కొ వినియోగదారుడిపై 12 వేల రూపాయలు భారం పడనుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. రైతుల పరిస్థితి ఇక చెప్పనక్కర లేదు. స్మార్ట్ మీటర్లు తమ పాలిట శాపంగా మారబోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు..

- రీఛార్జ్ చేయకుంటే కరెంట్ కట్
- ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రూ. 12 వేలు
- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో బిగింపు
- వాణిజ్య, గృహ సర్వీసులకు ఏర్పాటు చేసేలా కసరత్తు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12.24 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందికి రాబోతున్నాయి. ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రూ.12 వేలు పెట్టి కొనాల్సి ఉంటుంది. ఈ భారాన్ని వినియోగదారుడే భరించాలి. స్మార్ట్ మీటర్లను అందించే పనులను బాటను అదాని గ్రూప్ సంస్థకు ప్రభుత్వం ఇప్పగించినట్లు తెలిసింది. విడతల వారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు సిద్ధమవుతారు. మొదటి విడతగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తయ్యాక రెండో విడతగా వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఆ తరువాత మూడో విడతగా గృహాలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు. స్మార్ట్ మీటర్లను వినియోగించుకుంటే నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ చేసుకోవడం మరిచిపోతే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జ్ చేయాలంటే ఆన్‌లైన్‌లో మళ్లీ రిజిస్టర్ చేసుకోవాలి. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. దీని వలన విద్యుత్ శాఖకు లాభం ఉండొచ్చు కానీ సాధారణ ప్రజలకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమౌతుంది. ప్రస్తుతం నెలకు ఒక్కసారి విద్యుత్ బిల్లులు కడుతున్నాం. స్మార్ట్ మీటర్లు వస్తే ఇక్కడు వస్తే రీ ఛార్జ్ ఎప్పుడు అయిపోతే అప్పుడు వినియోగదారులు కట్టుకోవాల్సిందే.

2.5 లక్షల స్మార్ట్ మీటర్లు

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 2.50 లక్షల స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు పెట్టారు. ప్రతి రోజు మూడు వేల స్మార్ట్ మీటర్లు వివిధ కాట్యాగిరీలలో పెట్టాలని లక్ష్యంగా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలిచ్చింది. ఈ స్మార్ట్ మీటర్లు రావడం ద్వారా మొట్ట మొదటగా ఇంటింటికి తిరిగి బిల్లులు కొట్టేవారికి దెబ్బ పడనుంది. వీరికి భవిష్యత్తులో ఇంటింటికి తిరిగి బిల్లులు కొట్టే అవకాశం ఉండదు. ఫలితంగా వారందరిపై ప్రభుత్వం వేటు వేయనున్నట్లు సమాచారం. స్మార్ట్ మీటర్లు రావడం వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 527 మంది మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోనున్నారు.

200 యూనిట్లు దాటిన ఇళ్లకు కూడా



స్మార్ట్ మీటర్లు అదాని గ్రూప్ వారికి కాంట్రాక్టు ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముందుగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. 200 యూనిట్లు దాటిన ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,50,000 స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నారు.

- ఎం.ఉమాపతి, విద్యుత్ ఎస్‌ఈ.

తక్షణమే ఉపసంహరించుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం పాత మీటర్ల స్థానంలో కొత్తగా స్మార్ట్ మీటర్లు పెట్టి అదాని కంపెనీకి లాభం చేకూర్చే పని ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుకున్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలందరూ వ్యతిరేకించాలి.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హంద్రీనీవా నీటితో జిల్లాలో 42 చెరువులను నింపాల్సి ఉందన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపే కార్యక్రమం కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పుచ్చకాయల మాడలో వాటర్ పైప్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం వర్చువల్ తరగతులను వెంటనే ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఇఒ ను ఆదేశించారు.. తొలుత పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కొన్ని పాఠశాలల విద్యార్థులకు వర్చువల్ తరగతులను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అపార్ ఐడి జనరేషన్ పై ప్రతి రోజు ఎంఇఒలు,హెడ్ మాస్టర్లతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించాలని ఆదేశించారు. తొలి దశలో అన్ని ప్రీ మెట్రిక్ హాస్టల్స్‌లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం, ఒక టివిని కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హాస్టల్ ట్యూటర్ల ద్వారా హాస్టల్ విద్యార్థులకు కంప్యూటర్ విద్యకు సంబంధించిన బేసిక్ అంశాలను నేర్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బ్యాంకర్లు ముద్ర రుణాల మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ను ఆదేశించారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాబార్డ్ ద్వారా రూరల్ మార్ట్‌లు, రూరల్ హాట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై 100 లోకేషన్లలో సోలార్ ప్లాంటులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వేదవతి సాధనకు అఖిలపక్ష ఉద్యమం

- గంట పాటు రాస్తారోకో
- నాయకులతో పోలీసుల వాగ్వాదం

ప్రజాశక్తి -ఆలూరు

వేదవతి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతూ అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆలూరులోని ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. దాదాపు గంట సేపు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ స్థంభించింది. ట్రాఫిక్‌కు అంతరాయం అవుతున్నందున రాస్తోరోకో విరమించాలని నాయకులతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. ఇది ప్రజల సమస్య అని రాజకీయ పార్టీల సమస్య కాదని మాట్లాడుతుండా సిఐ వెంకటదళపతి వచ్చి త్వరలో ముగించాలని అనుమతించారు. నాయకులు మాట్లాడిన తరువాత ఆందోళన విరమించారు. సిపిఎం జిల్లా నాయకుడు పి.హనుమంతు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, ఎపిరైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ లక్ష్మీనారాయణ, సిపిఐ తాలూకా నాయకులు భూపేష్, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామలింగయ్య మాట్లాడారు. ఏళ్ల గడుస్తున్నా ఆలూరు అభివద్ధికి నోచుకోవడం లేదంటే పాలకుల స్వార్ధరాజకీయాలకు ఆలూరు ప్రాంత ప్రజలు, రైతులు బలై పోతున్నారన్నారు. కరువు ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గానికి శాశ్వత పరిష్కారం వేదవతి రిజర్వాయర్ నిర్మాణమే శరణ్యమని అన్నారు. వేదవతి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని 2007 నుండి వామపక్షాల అధ్యర్యంలో అనేక సార్లు ఆందోళన, ధర్నాలు, పాదయాత్రలు చేపట్టామన్నారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కోడుమూరులో వేదవతి నిర్మాణానికి రూ.1900 కోట్లు నిధులు కేటాయిస్తున్నామని, 8 టిఎంసి లతో నిర్మిస్తామని వర్చువల్‌గా ప్రారంభించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రీటెండరింగ్‌తో బడ్జెట్ రూ.1800 కోట్లతో 3.5 టిఎంసి లకు కుదించి పనులు ప్రారంభించిన మేఘ కంపెనీ రూ. 60కోట్లు ఖర్చు చేయగా కేటాయించిన నిధులు ప్రభుత్వం ఇతర వాటికి మళ్లించడంతో పనులు అర్ధాంతరంగా ఆపేశారన్నారు. మళ్ళీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్‌లో ఆలూరులోని వేదవతి, నగరడోన రిజర్వాయర్‌లకు నిధులు కేటాయంచకుండా మరోసారి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుతం బడ్జెట్‌లో వేదవతి నిర్మాణానికి రూ.500 కోట్లు నిధులు కేటాయించి భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఎకరాకు రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వెనుకబడి ప్రాంతాల అభివృద్ధికి నోచుకోని నియోజకవర్గం ఆలూరు అని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వలసలు వెళుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నా పాలకులకు చీమకుట్టినట్లు ఐనా లేదన్నారు. అడగందే అమ్మయినా అన్నం పెట్టదు అన్నట్లుగా ప్రజలు, రైతులు, నిరుద్యోగులు పాలకులను నిలదీయాలని కోరారు. ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుంటే భవిష్యత్తులో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి సిద్ధమౌతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, ఆలూరు, దేవనకొండ, ఆస్పరి,హోళగుంద,హాలహర్వి మండల కార్యదర్శులు షాకీర్, వీరశేఖర్, బాలకృష్ణ, వెంకటేశులు, క్రిష్ణ, కాంగ్రెస్ తాలూకా నాయకులు లక్ష్మన్న, ఆలూరు మండల అధ్యక్షుడు పూల రామాంజినేయులు, సిపిఐ మండల కార్యదర్శి రామాంజినేయులు, ప్రజా సంఘాల నాయకులు నవ్యంధ్ర ఎంఆర్‌పిఎస్ డివిజన్ అధ్యక్షులు, తాలూకా అధ్యక్షులు ఎల్లప్ప, కత్తి రామాంజినేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూరి తదితరులు పాల్గొన్నారు.



ఆలూరులోని ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు



నాయకులతో వాగ్వాదం చేస్తున్న పోలీసులు

విఒలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు
- కలెక్టరేట్ ఎదుట విఒఎల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వెలుగు సంస్థలోపనిచేస్తున్న విఒఎ వెలుగు యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం ఎపివిఒఎల ఉద్యోగుల సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షులు గుంటేప్ప అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు మాట్లాడుతూ విఒఎలకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోయాయని, రాజకీయ వేధింపులను మానుకోవాలన్నారు. కక్ష సాధింపు చర్యలో భాగంగా గతంలో అనేక సంవత్సరాల నుండి పనిచేస్తున్న తొలగించి కొత్తవారిని తీసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. ఇప్పటికే అనేక మండలాల్లో తొలగింపులు జరిగాయని, తొలగించిన విఒఎలను అదే స్థానంలో కొనసాగించాలన్నారు. కాలపరిమితి సర్క్యులర్ ప్రకారం ఇంకా పనిచేసే దానికి అవకాశం ఉన్నా తొలగించడమేంటని ప్రశ్నించారు. కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు అధికారంలోకి వస్తే కాల పరమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. విఒఎలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్ ఏర్పాటుతో పాటు యూనిఫామ్, మహిళ మార్టుల్లో బలవంతంగా సరుకులు కొనుగోలు ఆపాలని కోరారు. అనంతరం ఎపిడి శ్రీధర్ రావుకు కలిసి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి సుంకన్న, వెంకటస్వామి, జయమ్మ, మద్దిలేటి, రమణయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విఒఎలు



కేంద్ర పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

స్వానిధిభీ స్వాభిమాన్ భీపక్వాడ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై మెప్మా ఆధ్వర్యంలో కల్లూరులోని ఇందిరమ్మ కట్టవద్ద మెప్మా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో కల్లూరు ఇందిరమ్మ కట్టవద్ద కమ్యూనిటీ హాల్ లో వీధి వ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మెప్మా అధికారులు, బ్యాంక్‌అధికారులు, పట్టణసమాఖ్య వారు పాల్గొన్నారు. సిఎంఎం విజయభాస్కర్ రెడ్డి, సిఒ పుల్లయ్య మాట్లాడుతూ వీధి వ్యాపారులు తీసుకున్న రుణాలు సక్రమంగా వినియోగించుకొని వారి వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలన్నారు. లావాదేవీలు అన్నియు కూడా క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ లావాదేవీలు చేసుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు జీవన జ్యోతి భీమా, సురక్ష భీమా వంటివి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మురుగునీరు నిలువకుండా చర్యలు

పూడికతీత పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని మురుగు కాలువల్లో మురుగునీరు ప్రవాహానికి ఆటంకాలు ఉన్న ప్రదేశాలలో, ఆయా కాలువల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జోహరపురం, జమ్మిచెట్టు, రాధా, రేణుకనగర్, రిచ్మండ్‌కాలనీ, వీకర్‌సెక్షన్‌కాలనీ, తదితర ప్రాంతాల్లో కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించి, ఆయాకాలనీల స్థానికులతో మాట్లాడారు. స్థానికులు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా పలుకాలనీల సమస్యల ప్రదేశాలను పరిశీలించారు. సరైన అనుసంధానం లేక మురుగునీరు బయటకు వెళ్లేందుకు ఆస్కారం లేని చోట్ల, అవసరమైన నిర్మాణాలను చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. మురుగుకాలువల్లో పూడికతీత పనులు మరింత వేగవంతంగా చేయాలన్నారు. ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి, డిఇఇ గిరిరాజు, పట్టణ ప్రణాళిక సూపర్వైజర్ అంజాద్‌బాషా, ఎఇ ప్రవీణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు , ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, సిఐటియు జిల్లా కోశాధికారి నాగరాజు డిమాండ్ చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు డిఇ టెక్నికల్ ఓబులేసు కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈనెల 22న జరగనున్న హెచ్ఆర్ మీటింగులో కాంట్రాక్టు కార్మికులు ఔట్‌సోర్సింగ్ కార్మికులు, పీస్ రేట్ కార్మికుల సమస్యలు చర్చించాలని కోరారు. వారు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. 2022 పిఆర్‌సి ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, పెండిం గులో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఐటిఐ విద్యార్హత కలిగిన వాచ్మెన్లందరికీ షిఫ్ట్ ఆపరేటర్‌గా అవకాశం కల్పించాలని కోరారు. ఇప్పటికే షిఫ్ట్ ఆపరేటర్లుగా ప్రమోషన్ పొందిన వారికి పాత ఆపరేటర్స్‌తో సమానంగా జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తూ కార్మికునికి ఐటిఐ విద్యార్హత ఉన్న వారిని స్కిల్‌గా ప్రమోట్ చేసి పాత ఆపరేటర్స్‌తో సమా నంగా జీతాలు ఇవ్వాలని కోరారు. అన్నిసబ్ స్టేషన్లోవాచ్మెన్లను నియ మించాలని, కార్మికుల ప్రాణాలు కాపాడాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. 10 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి 2018లో ఇచ్చిన విధంగా ఇన్సెంటివ్ పెరిగిన ధరలకు అనుగుణంగా ఇప్పుడు కూడా ఇవ్వాలని, గతంలో మాదిరిగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి విడిఎ ఇవ్వాలని కోరారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న సర్కిల్ ఆఫీసులలో కాంట్రాక్ట్ కార్మికుల అనుమతితోనే వారిని బదిలీలు చేయాలని ఖాళీలలో నూతన కార్మికులతో భర్తీ చేయాలని కోరారు. పనిచేస్తున్న ప్రతి కార్మికునికి హెల్త్ కార్డులు ఇవ్వాలని అన్ లిమిటెడ్ ఉచిత వైద్యం అందించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీస్‌రేట్ కార్మికులైన మీటర్ రీడర్స్, స్టోర్ హమాలిలో బిల్ కలెక్షన్ ఏజెంట్లు, ఎస్‌పిఎం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు రావడం వల్ల మీటర్ రీడర్స్ ఉద్యోగ భద్రత లేకుండా పోయే ప్రమాదం ఉందని వీరందరినీ నైట్ వాచ్మెన్ గా సబ్ స్టేషన్ లో నియమించాలని, వారి అర్హతకు తగిన విధంగా ఆఫీసుల్లో ఉపయోగించుకోవాలని కోరారు. పనిచేస్తున్న కార్మికులందరికీ ఐడి కార్డులు మంజూరు చేయా లన్నారు. కార్మికులపై రాజకీయ వేధింపుల ఆపాలని ఇప్పటికే ఉద్యోగం నుండి తొలగించిన వారిని వెంటనే ఉద్యోగంలోకి తీసు కోవాలని కోరారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూని యన్ నాయకులు చల పతి, మోహన్ పాల్గొన్నారు.



టెక్నికల్ డిఇ ఓబులేష్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గ్రంథాలయాన్ని ఆధునీకరిస్తాం

యువతకు ఉపయోగపడే పుస్తకాలు ఉంచుతాం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గ్రంథాలయ స్టడీల్యాబ్ ఎసితో ఆధునీకరించి, యువతకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలను అందజేస్తామని మాజీ రాజ్యసభ సభ్యుడు టిజి.వెంకటేష్ చెప్పారు. బుధవారం కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగించారు. ముఖ్య అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్, కెవిఎస్‌ఆర్ విద్యా సంస్థల అదినేత, టిడిపి యకులు కెవిసుబ్బారెడ్డి పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు కె.చంద్రశేఖర కల్యాకర, కెజి.గంగాధరరెడ్డి, తెలుగుబాష వికాస వ్యవస్థాపకులు జెఎస్‌ఆర్‌కె.శర్మ , జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క పాల్గొన్నారు. టిజి.వెంకటేష్ మాట్లాడుతూ ఈనాటి సమాజానికి విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. బావితరాలవారికి అధునాతన విద్యను అందించడానికి విజ్ఞానాన్ని పెంపొందించడానికి గ్రంథాలయాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. వారికి కావలసిన పోటీ పరీక్షల మెటీరియల్, ఆధునిక చరిత్రలతోపాటు బారత, భాగవత కథలులాంటివి కూడా అందుబాటులోకి తేవాలన్నారు. గ్రంథాలయ స్టడిల్యాబ్‌ను ఎసితో పాటు అన్ని రకాల పుస్తకాలను అందజేస్తూ సౌకర్యాలను కల్పిస్తానని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు ఈ గ్రంథాలయాన్ని బాగా ఉపయోగించుకోవాలన్నారు. పేద ప్రజలకు, విద్యార్థులకు సహాయకారిగా ఉంటానన్నారు. వారోత్సవాలను సక్రమంగా జరుగుటకు సహకరించిన వారిని సన్మానించారు. కెవిసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రజలు, పుస్తకాలను చదవడం బాగా అలవాటు చేసు కోవాలన్నారు. గ్రంథాలయానికి అవసరమైన అన్ని సౌకర్యాలతో పాటు మంచి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులోకి తెస్తామన్నారు. సంస్థ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ మన దాతల సహాయ సహకారాలతో , ప్రభుత్వం సహకారంతో విద్యార్థులకు, పాఠకులకు, ప్రజలకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించగలమని, విద్యార్థులు గ్రంథాలయాలను విని యోగించుకోవాలన్నారు. మంచి జ్ఞానంగల పుస్తకాలను ఏర్పాటు చేస్తు ఆధునికంగా కంప్యూటర్ టెక్నాలజీని అంద జేస్తామన్నారు. ఈ వారంరోజులు ఈ వారోత్సవాలను దిగ్విజయంచేసిన సిబ్బందికి వాలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు. నిఖిలేష్ యడ్యుకేషన్ అకాడమి అధ్యక్షులు టి .మద్దులేటి, రిటైర్డ్ ఇంజనీరు ముచ్చుకోట చంద్రశేఖర్, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్లు బాష, చంద్రమ్మ, నషీమా, రేణుక, ఈశ్వరమ్మ, ఉమ, నాగభాస్కర్, శ్రీనువాసులు, గ్రంథాలయ సిబ్బంది, మగ్బుల్‌బాష, రాజు, సుదర్శన్, సువర్ణమ్మ, ప్రజలు, విద్యార్థులు, పాఠకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న టిజివెంకటేష్, కెవిసుబ్బారెడ్డి , తదితరులు



నాణ్యమైన బోధన అందించాలి

ప్రజాశక్తి సి బెళగల్

విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన సక్రమంగా అందించాలని ఎంఇఒ - 2 ఆడమ్ బాషా ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం సి బెళగల్ హైస్కూల్‌లో స్కూల్ క్యాంప్లెక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గణితం, సైన్స్, తెలుగు, హిందీ, సామాజిక శాస్త్రం బోధనలో మెలకువలు పాటించాలన్నారు. విద్యార్థులను తమ పిల్లల వలే భావించి అక్షర జ్ఞానంపై మేధోశక్తిని పెంపొందించాలని తెలిపి సృజణాత్మక శైలిని విద్యార్థుల్లో వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులకుందన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి కోరారు. రాష్ట్రంలోని కోస్తాంధ్రలో, పక్క రాష్ట్రం కర్ణాటకలో ఎస్టీ జాబితాలో ఉన్న వాల్మీకులను రాయలసీమలో మాత్రం బీసీలుగా ఉంచడం అన్యాయమని తెలిపారు. బుధవారం ఆలూరు ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అసెంబ్లీకి వెళ్లడం లేదని తెలిపారు. వెళ్లి ఉంటే వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేసే వారమని చెప్పారు. రాష్ట్రంలో 2018లో అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపారని, వైసిపి అధినేత జగన్ కూడా ఏకసభ్య కమిషన్ వేసి కేంద్రానికి నివేదిక పంపారని గుర్తు చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిలబడాలంటే మన ఎంపీలు అవసరమని, చంద్రబాబు, కూటమి ప్రభుత్వంలో ఉన్న పవన్ కల్యాణ్, బిజెపి ఎమ్మెల్యేలు వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేయాలని కోరారు. బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరామ్ డిమాండ్ చేయాలని, దీనికోసం పార్టీలకతీతంగా కృషి చేయాలని తెలిపారు. అలాగే ఎస్టీ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలకు నూతన భవనాలు, అరికెర గురుకుల పాఠశాలలో ఆర్ట్స్ గ్రూపుతో పాటు సైన్స్ గ్రూపు ప్రవేశ పెట్టాలని కలెక్టర్‌కు ఇది వరకే విన్నవించామన్నారు. వైసిపి నాయకులు అరికెర వీరేష్, ఎల్లప్ప, నాగేంద్ర, పెట్రోల్ బంక్ కిషోర్, జీరా గౌడ్, కురువల్లి శివ, వీరభద్ర, రాజు, రామాంజినేయులు, తిక్కస్వామి పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల వివరాలు నమోదు చేయాలి

- మెప్మా పీడీ శివ నాగలీల


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిలాని

ప్రజాశక్తి - ఆదోని

వీధి వ్యాపారుల వివరాలు నమోదు చేయాలని మెప్మా పీడీ శివ నాగలీల, సిటీ మార్కెటింగ్ మేనేజర్ జిలాని తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ సముదాయంలోని మెప్మా హాలులో 'పిఎం స్వానిధిబి, స్వాభిమాన్ బి'పై రిసోర్స్ పర్సన్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని వీధి వ్యాపారాలు చేసుకునే వారి వివరాలు నమోదు చేసి, వారి అవసరం మేరకు బ్యాంకుల ద్వారా రుణాలందించి ఆర్థికంగా అభివృద్ధి అయ్యేందుకు సహకరించాలని ఆదేశించారు. నెల రోజులపాటు నమోదు డ్రైవ్ ఉంటుందని, అందరినీ నమోదు చేయాలని తెలిపారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ పంకజ కల్యాణి ఉన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కృషి చేయాలి

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, సాయిబాబా


ఎంపీతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

మంత్రాలయం నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం కృషి చేయాలని, రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, సాయిబాబా కోరారు. బుధవారం మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును మర్యాద పూర్వకంగా కలిసి సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. కౌతాళం మండలంలో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన హాల్వి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి, పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తుంగభద్ర జలాలు వినియోగించుకోవడానికి కృషి చేస్తోందని తెలిపారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంత అభివృద్ధికి తుంగభద్ర జలాలు రైతులకు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, సీనియర్ నాయకులు పట్టాభి, హాల్వి సిద్ధప్ప, రామలింగన్న, శివ మూర్తి పాల్గొన్నారు.

13,107 ఎకరాల్లో పంట నష్టం : ఎఒ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలో కరువు వల్ల 13,107 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఎఒ వరప్రసాద్ తెలిపారు. బుధవారం నష్టపోయిన రైతుల జాబితాను ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల దగ్గర సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మండలాన్ని కరువుగా ప్రకటించిందని, వర్షాధారం కింద సాగు చేసిన పత్తి, వేరుశనగ, ఆముదం, సజ్జ పంటలను చేరుస్తూ నష్టపోయిన 9,560 మంది రైతుల జాబితాను తయారు చేసినట్లు తెలిపారు. ఆయా రైతులు జాబితాను పరిశీలించి అభ్యంతరాలుంటే ఈనెల 24 నాటికి తెలియజేయాలన్నారు. ఎం.శ్వేత, ఇందు పాల్గొన్నారు.

పత్తి రైతుపై ఆంక్షల కత్తి..!

- తేమ శాతం పేరిట సిసిఐ కొర్రీలు
- 5 కేంద్రాలకు ఒక చోట నామమాత్రపు కొనుగోళ్లు
- ప్రయివేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) విధించిన ఆంక్షలు రైతులకు గుదిబండగా మారాయి. 8-12 శాతం తేమ కలిగిన పత్తిని మాత్రమే కొనుగోలు చేసేలా నిబంధనలు రూపొందించారు. ఈఏడాది కురిసిన వర్షాలు పత్తి పంటను దెబ్బతీయగా, వర్షాలతో పంట నాణ్యత కోల్పోయింది. వర్షాధారంగా వేసిన పంట సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అధిక వర్షాలు, తేమ కారణంగా 4 నుంచి 5 క్వింటాళ్లు మించడం లేదు. అరకొరగా వచ్చిన పత్తిని గ్రామాలు, మార్కెట్లలో వ్యాపారులు క్వింటాకు రూ.4 వేల నుంచి రూ.6,500 మధ్య కొనుగోలు చేస్తున్నారు. కనీస మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లకు సిసిఐని రంగంలోకి దించగా.. ఆదోని వ్యవసాయ మార్కెట్ పరిధిలో 5 జిన్నింగ్ మిల్లులను కొనుగోళ్లకు ఎంపిక చేశారు.

దిక్కుతోచక ప్రయివేట్‌లో విక్రయం

ఈఏడాది కేంద్ర ప్రభుత్వం తేమశాతం ఆధారంగా పత్తికి గరిష్టంగా రూ.7,521 ధర నిర్ణయించింది. అధిక వర్షాలతో దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో మద్దతు ధర తమకు కలిసి వస్తుందని రైతులు ఆశించారు. తేమ శాతం పేరిట సిసిఐ కొర్రీలు పెడుతుండడం రైతులకు శాపంగా మారింది.


ఆదోని మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తి (ఫైల్)

మరోవైపు సిసిఐ కేంద్రాల్లో జాప్యాన్ని ఆసరా చేసుకుంటున్న వ్యాపారులు రూ.4 వేల నుంచి రూ.6,500 ధరతోనే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. రైతులు క్వింటాకు రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు నష్టపోతున్నారు.

కొనుగోళ్లు అంతంతే..!

5 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆదోని మార్కెట్ పరిధిలోని 1 జిన్నింగ్ మిల్లులో కొనుగోళ్లు మొదలయ్యాయి. మార్కెట్ పరిధిలో మరో మిల్లులో కొనుగోళ్లు మొదలుపెట్టగా మిగతా 1 కేంద్రంలో ఇంకా శ్రీకారం చుట్టలేదు.

మద్దతు ధరకు తూట్లు

పత్తిలో ఉన్న తేమ, రంగును బట్టి వ్యాపారులు ధరను నిర్ణయించాల్సి ఉంది. తేమశాతం ఎంత తక్కువగా ఉంటే అంత ఎక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం 8 నుంచి 12 వరకు తేమ శాతం ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేసేందుకు దళారులు ఆసక్తి చూపిస్తున్నారు. 8 శాతం కన్నా ఎక్కువగా ఉంటే ఒక్కో శాతానికి కిలో ధర చొప్పున కోత విధిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు, ఇతర కారణాలతో పత్తిలో తేమ 18-25 శాతం వరకు నమోదవుతోంది. ఆ స్థాయిలో ఉన్న పంటకు క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6,300 మధ్య మాత్రమే ధర పలుకుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కాయ, రంగు మారిందంటూ...

కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతంతో పాటు అదనంగా పత్తిలో కాయ వస్తోందని, రంగు మారిందని సిసిఐ అధికారులు సాకులు చెబుతున్నారు. రైతులు పత్తి చేన్లలో మూడు దశల్లో పత్తి తీస్తారు. ఇందులో సాధారణంగా మొదటి, రెండోసారి పత్తి ఎక్కువగా వస్తుంది. రైతులు పెట్టుబడుల కోసం, అప్పులు తీర్చుకునేందుకు పత్తిని ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొస్తున్నారు. కేంద్రాల్లో మాత్రం పత్తిలో తేమశాతం అధికంగా ఉందని, ఇటీవల వర్షాలకు పంట నాణ్యత దెబ్బతినిందని సాకులు చెబుతూ తిరస్కరిస్తున్నారు. ప్రయివేటు మిల్లర్లు కనీస మద్దతు కన్నా రూ.వెయ్యి తక్కువకే కొనుగోలు చేస్తున్నారు.

పెట్టుబడి కూడా మిగల్లేదు

- కృష్ణ, రైతు, పెద్దహరివాణం, ఆదోని మండలం

నేను 6 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశాను. ఎకరాకు రూ.40 వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. ఈసారి వర్షాలకు పంట దిగుబడి సగానికి తగ్గింది. పండించిన పంటను సిసిఐ కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే మద్దతు ధర ఇవ్వడం లేదు. సాకులు చెబుతూ ధర తగ్గిస్తున్నారు. ప్రయివేట్ వ్యాపారులు క్వింటాకు కనీసం రూ.6,500 కూడా ఇవ్వడం లేదు.

తేమ పేరిట కొర్రీలు

- వెంకటేశులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

పత్తి కొనుగోళ్లలో సిసిఐ కొర్రీలు పెడుతోందని రైతులు వాపోతున్నారు. వర్షాల కారణంగా ప్రస్తుతం విక్రయానికి వస్తున్న పత్తిలో 20శాతం మేర తేమ ఉంటోందని సిసిఐ వెనుకడుగు వేస్తోంది. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వ శాఖలు మాత్రం సిసిఐ పత్తి కొనుగోళ్లకు సిద్ధంగా ఉండడంతో క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేక రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు మేలు చేసే విధంగా కొనుగోలు చేయాలి.

తేమ ఎక్కువగా ఉండడంతోనే

- గౌతమ్, సిసిఐ ఇన్‌ఛార్జీ, ఆదోని.

8-12 శాతం మధ్య తేమ ఉంటే సిసిఐ పత్తి కొనుగోలు చేస్తోంది. అలా ఉండేలా రైతులు ఆరబెట్టుకుని తీసుకురావాలి. నిబంధనల మేరకు నాణ్యత ఉంటే కొనుగోళ్లు చేస్తుంది. సోమవారం నుంచి ఆదోని వ్యవసాయ మార్కెట్ గుర్తించిన అన్ని మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు మొదలవుతాయి.

రస్తా వివాదాన్ని పరిష్కరించండి

- రైతు ఈరన్న



ప్రజాశక్తి - దేవనకొండ

పొలం రస్తా వివాదాన్ని పరిష్కరించాలని రైతు గొల్ల ఈరన్న కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కుంకనూరు గ్రామ రెవెన్యూలో గద్దెరాళ్ల గ్రామ సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 706లో 6.48 ఎకరాల పొలం ఉందని తెలిపారు. దీనికి ఆనుకొని ఉన్న గొల్ల సూరన్న పొలంలో తన పొలానికి వెళ్లేవారమని, కొన్ని నెలలుగా తనను వెళ్లనీయడం లేదని వాపోయారు. ఇబ్బందులు పడుతున్నామని, రస్తా వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. గతంలో సూరన్న పొలం నుంచి తన పొలానికి వెళ్లేవారమని, 'నీకు రస్తా లేద'ని గొల్ల సూరన్న వివాదానికి తెర తీసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రస్తా వివాదం గురించి పోలీసు అధికారి వద్ద జరిగిన పంచాయితీలో సూరన్న రాజీపత్రం కూడా రాయించి ఇచ్చారన్నారు. పొలం రస్తా వివాదం గురించి జెసికి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మండల రెవెన్యూ అధికారులు ఈ రస్తా వివాదాన్ని పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. ఈ వివాదం గురించి సిఐ వంశీనాథకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వివాదాన్ని పరిష్కరించి తనకు న్యాయం చేయాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆలూరు


బాధ్యతలు చేపడుతున్న ఎస్ఐ దిలీప్ కుమార్

శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ దిలీప్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఆలూరు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న ఎస్ఐ సి.వెంకటనరసింహులు కర్నూలు విఆర్‌కు బదిలీపై వెళ్లారు.

'రబీ' బీమా చెల్లించండి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



రబీ సీజన్‌లో విత్తనం వేసిన ప్రతి రైతూ బీమాను చెల్లించుకోవాలని ఎఒ జయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె చిప్పగిరి రైతు సేవా కార్యాలయంలో మాట్లాడారు. ఆయా పంటలకు బీమా చెల్లించడానికి డిసెంబర్ 15 వరకు గడువు ఉందన్నారు. ఒక్క వరి పంటకు మాత్రమే డిసెంబర్ 31 వరకు గడువు ఇచ్చారని తెలిపారు. బీమా పొందిన రైతులకే ప్రభుత్వం అందించే కరువు పరిహారం, రాయితీల సహాయం అందుతుందన్నారు. బీమా చెల్లించే పద్ధతి కూడా గ్రామ, మండల స్థాయిలో వేర్వేరుగా ఉంటాయని తెలిపారు. రైతులు అశ్రద్ధ చేయకుండా దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో పూర్తి వివరాలు తెలుసుకొని, ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఇసుక, ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు : తహశీల్దార్

ప్రజాశక్తి - మంత్రాలయం

ఇసుక, ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎస్.రవి హెచ్చరించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో సూగూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం ద్వారా స్థానికంగా ఉండే నదులు, వాగుల వద్ద నుంచి అవసరమైన ప్రజలు పొందవచ్చని తెలిపారు. ట్రాక్టర్ల యజమానులు, వ్యాపారులు భూగర్భ గనుల శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. జెసిబిలతో ఇసుకను, ఎర్రమట్టిని పెకలించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గృహ అవసరాలకు ఇసుక అవసరమైన వారు స్థానిక సచివాలయాల్లోని కార్యదర్శుల వద్ద అనుమతి తీసుకుని పొందవచ్చని తెలిపారు. జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, జిల్లా ఉపాధ్యక్షులు రత్నం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పని చేస్తున్న నాటూరు నీలకంఠ వైద్య ఖర్చులకు ఎస్‌టియు నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. నీలకంఠ బ్రెయిన్‌లో రక్తనాళాల సమస్యతో బ్రెయిన్ ఆపరేషన్ కోసం కర్నూలులోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం నాయకులు ఆయనను పరామర్శించారు. ఉపాధ్యాయుల సహకారంతో సేకరించిన విరాళాలు రూ.3 లక్షలను ఎస్‌టియు నాయకులు ప్రసన్నరాజు, వెంకటేశ్వర్లు అందజేశారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్ధన్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, నాయకులు మహ్మద్ షఫీ, బసవరాజు, బాబయ్య, ఎల్లప్ప, అడివన్న, సిద్ధ లింగమూర్తి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'మిగులు భూముల సమస్యను పరిష్కరించండి'

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలో మిగులు భూములుగా ఉన్న పొలం రైతుల సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని ఆలూరు మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ఎస్.పంపాపతి కోరారు. బుధవారం ఆయన మాట్లాడారు. రెవెన్యూ కార్యాలయంలో రైతుల పట్టా భూములు మిగులు భూములుగా ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని అధికారులకు అర్జీల రూపంలో విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి రైతుల పట్టా భూములకు 1బి అడంగల్‌లో మార్పులు, చేర్పులు చేసేందుకు అవకాశం కల్పించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి సీనియర్ నాయకులు ఎర్రి స్వామి పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌ఆర్‌సి, లోకాయుక్త తరలింపు అక్రమం

- సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

మానవ హక్కుల కమిషన్, ఎపి లోకాయుక్తను తరలింపు అక్రమమని ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్‌కె.సుందర్ సింగ్ విమర్శించారు. బుధవారం కోర్టు సముదాయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టి, అక్కడ ధర్నా నిర్వహించారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, ఎపి లోకాయుక్తను కర్నూలు నుంచి అమరావతికి తరలించడాన్ని నిరసిస్తూ ఈనెల 22 వరకు విధులు బహిష్కరించి నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది దేశాయ్ మాట్లాడుతూ... ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కర్నూలు నుంచి ఎస్‌హెచ్‌ఆర్‌సి, ఎపి లోకాయుక్తలను అమరావతికి తరలించాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని హైకోర్టుకు ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలి కేబినెట్‌లో అధికారిక చొరవ తీసుకుని కర్నూలులో ఎపి హైకోర్టు బెంచి ఏర్పాటు చేయడం సమంజసమని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్, సీనియర్ అడ్వకేట్ వైఆర్.మల్లికార్జున మాట్లాడుతూ... ఎన్‌డిఎ ప్రభుత్వంలోని సంకీర్ణ భాగస్వాములు మౌనంగా ఉండకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. అలాగే మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు కూడా రాయలసీమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని ఖండించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ న్యాయవాది బషీర్ అహ్మద్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు జీవన్, లోకేష్, శివ ప్రసాద్, బంగారయ్య, నాగేంద్రయ్య, ఆనంద్, రజనీకాంత్, రామాంజనేయులు, సాయి, ఉమా, కృష్ణ యాదవ్, హుస్సేన్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



వంద పడకల ఆస్పత్రి నిర్మించాలి

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి వినతిపత్రం అందజేశారు. బుధవారం మంగళగిరిలోని మంత్రి ఛాంబర్‌లో కుటుంబ సంక్షేమం, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను కలిసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం నాలుగు మండలాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరికరాలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు 24 గంటలూ వైద్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో సిబ్బందిని పెంచి మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. టిడిపి యువ నాయకులు రాకేష్ రెడ్డి ఉన్నారు.

యువకుని అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఆదోని


మహ్మద్ గౌస్ (ఫైల్)

పట్టణంలోని బార్ పేటలో బుధవారం తెల్లవారుజామున యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందారు. టీ తాగి వస్తానని ఇంట్లో తల్లికి చెప్పి వెళ్లిన మహ్మద్ గౌస్ (28) మురుగు కాలువలో మృతదేహమై కనిపించారు. తెల్లవారుజామున లేచి టీ తాగి వస్తానని వెళ్లిన కొడుకు ఇలా మృతి చెందడంపై తల్లి రోధనలు మిన్నంటాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కాలువ నుంచి బయటకి తీసి అక్కడే పడి ఉన్న కూరగాయలు కోసే కత్తిని స్వాధీనం చేసుకున్నామనిఆదోని త్రీ టౌన్ సిఐ రామలింగయ్య తెలిపారు. గౌస్ సెంట్రింగ్ కార్మికుడుగా పని చేస్తూ కుటుంబానికి అండగా ఉన్నారని, గతేడాది తండ్రి మృతి చెందారని ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లారని మృతుడి తల్లి వివరించారని తెలిపారు. ఘటన స్థలంలో లభ్యమైన కత్తి కూడా ఇంట్లోదని కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. పూర్తి విచారణ చేపట్టి, ఆత్మహత్యా లేక హత్యా తెలుస్తామని సిఐ వివరించారు.

సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలి


- కెడిసిసి బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, జడ్‌పిటిసి దొరబాబు

ప్రజాశక్తి - ఆస్పరి

విద్యార్థులు సెల్‌ఫోన్ వాడడం తగ్గించి గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని కెడిసిసి బ్యాంక్ జిల్లా మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, జడ్‌పిటిసి దొరబాబు, వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజినేయులు, టిడిపి యువ నాయకులు సతీష్, నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి సూచించారు. బుధవారం గ్రంథాలయ 57వ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి విశ్వనాథ ఆధ్వర్యంలో వారం రోజులుగా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సెల్ ఫోన్లకు అలవాటు పడకుండా గ్రంథాలయంలో దొరికే పుస్తకాలు, న్యూస్ పేపర్లు చదవడం వల్ల జ్ఞానంతో పాటు ప్రపంచంలో జరిగిన విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం క్రీడ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నీలకంఠప్ప పాల్గొన్నారు. **ఆదోని** గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సుజాత ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆదోని ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు, గ్రంథాలయ అధికారి సుజాత మాట్లాడారు. ఈనెల 14 నుంచి 20 వరకు వివిధ పాఠశాలల విద్యార్థులకు ఆయా అంశాలపై పోటీలు నిర్వహించామని, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశామని తెలిపారు. శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ హరికృష్ణ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. **చిప్పగిరిలో** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. గ్రంథాలయ కార్యాలయంలో గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ ఆధ్వర్యంలో వివిధ రకాల ఆటల పోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్‌లో నెగ్గిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రంగనాయకులు, గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ మాట్లాడారు. చదువుకున్న ప్రతి ఒక్కరూ టచ్ మొబైల్‌ను తగ్గించి గ్రంథాలయాలకు వచ్చి తోచిన పుస్తకం చదివితే ఎన్నో కొత్త కొత్త విషయాలు తెలుస్తాయని చెప్పారు. విద్యార్థులు కూడా సెలవు రోజుల్లో గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసుకోవాలని సూచించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయులు గోవర్ధన పాల్గొన్నారు. **నందవరం** గ్రంథాలయ అధికారి వై.శివరామప్రసాద్ వారోత్సవాలను నిర్వహించారు. ఎంఇఒ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులకు పరుగు పందెం, మ్యూజికల్ ఛైర్స్, స్కిప్పింగ్, ఖోఖో వంటి క్రీడలు, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించామని చెప్పారు. క్రీడల్లో గెలుపొందిన 50 మంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు.


చిప్పగిరిలో బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు


ఆస్పరిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు


ఆదోనిలో సిఐని సన్మానిస్తున్న సిబ్బంది


నందవరంలో

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో గౌరవాధ్యక్షులు అజీమ్ ఖాన్

ప్రజాశక్తి - ఆదోని


డిపో ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

ఎపిఎస్‌ఆర్‌టిసిలో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, వివిధ రకాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) డిపో గౌరవాధ్యక్షులు అజీమ్ ఖాన్ కోరారు. బుధవారం ఆదోని ఆర్‌టిసి డిపో ముందు ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని డిపోలో ఉద్యోగులు, కార్మిక సమస్యలపై స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. నైట్ అవుట్, డేఅవుట్ అలవెన్సులు, ఇన్సెంటివ్‌లు, టిఎ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. కొత్త బస్సులు కొనుగోలు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. 12వ పిఆర్‌సిని అమలు చేయాలని కోరారు. 2024లో పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలను విడుదల చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లకు గుర్తింపు కార్డులు, ప్రివిలేజ్ బస్సు పాసులు ఇవ్వాలని కోరారు. గ్యారేజ్ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షులు వైపి.ప్రసాద్, సెక్రటరీ ఎ.రవి, జాయింట్ సెక్రటరీ ఎంఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పరిశీలించారు. బుధవారం పట్టణంలోని ట్యాంకు బండ్ రోడ్ ప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలించారు.

కూలి ధర పెంచాలి

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీల కూలి ధరలు పెంచాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు కోరారు. బుధవారం మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డికి విన్నవించారు. హమాలీలతో కలిసి యార్డు అధికారులతో కూలి ధరల పెంపుపై మాట్లాడారు. కూలి ధరల పెంపు ఒప్పందం రెండేళ్లు పూర్తి అవడంతో, పెంచే దిశగా ఆలోచన చేయాలని కోరారు. వ్యాపార కమీషన్ ఏజెంట్ సంఘాల నాయకులు వెంకటరామిరెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, తిమ్మప్ప పాల్గొన్నారు.


కార్యదర్శితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి : సిఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని ప్రయివేట్ లాడ్జీల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సిఐ రామాంజులు కోరారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. లాడ్జీల్లోనే కాదు.. లాడ్జీలకు ముందు వైపు, ఇరువైపులా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. లాడ్జీల రూముల ధరలు భక్తులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లాడ్జీల యజమానులతో లీజుకు తీసుకున్న నిర్వాహకులు బాడుగలు తగ్గించుకుని భక్తులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని పేర్కొన్నారు. లాడ్జీల నిర్వాహకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ రామాంజులు

టిడిపితో భరోసా

- తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు

ప్రజాశక్తి - కౌతాళం

దేశంలో ఏ రాజకీయ పార్టీ ఇవ్వని భరోసా.. టిడిపి ఇస్తుందని తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు తెలిపారు. బుధవారం టిడిపి సభ్యత్వ నమోదును స్థానిక అత్తవారి, ఉప్పర్ గేరిలలో కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి కార్యకర్తలు, అభిమానులు ప్రతిఒక్కరూ సభ్యత్వం చేసుకోవాలని కోరారు. దేశంలో ఏ పార్టీ కార్యకర్తలకు లేని గుర్తింపు, భరోసా టిడిపి ఇస్తుందని తెలిపారు. కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యుల విద్య, వైద్యానికి సహాయ, సహకారాలు అందిస్తుందని చెప్పారు. ఆర్ఎంపి డాక్టర్స్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాజానంద్, ఈరన్న, గురు, బాష, వీరారెడ్డి పాల్గొన్నారు.


సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు